ఎ. యస్వీ. రమణారావు




# జైలుల్లో — చందమామ

ఆ భోగట్టా వొక్కటీ చెప్పేద్దా(వనీ, వెళ్ళానా యింటికి మళ్ళీ-నిజానికి నేను వెళ్ళక్కర్లేదు—

ఆ విషయం తెలుసుకోవాల్సిన అవుసరం వాళ్ళదే-అంచేత వాళ్ళే ఎవరయినా వొస్తారు.

అయినా—

మనకు అక్కర్లేనప్పుడు-మనం చెప్పటమే ధర్మం....

అందువల్ల, మనకు మనం ఆపాదించుకున్న హోదా ఏదో తక్కువయిపోతుందనుకోడం మూర్ఖత్వమే....

వీధిగుమ్మం తలుపులు బార్లా తెరుచున్నాయి—

ఆ గుమ్మంలోంచి చూస్తే, కొసాకీ కని

పెంచే ఆ యింట్లో ఎవరూవున్న సందదేలేదు!

నిన్న సాయంకాలం ఈ పాటికి పదిమందీ తిరుగాడుతూ హడావుడిగా వున్న ఆ యిల్లు ఈ క్షణంలో యింత నిశ్శబ్దంగా వుండటం ఆశ్చర్యంవేసింది నాకు.

"ప్రకాశరావుగారూ" వరండాలో గుమ్మం ముందు నిల్చొని పిలిచాను.

"....... ...."

మళ్ళీ పిలిచాను.

"ఎవరూ?" తియ్యటిగొంతు చాలా లోపల్నుంచి.

ఆ గొంతు నిన్న విన్నదేనా?

అంత గుర్తుండటానికి నిన్నవున్నది ఎంత సేపని?

మాట్లాడించిన మాట లెన్నని?

"ప్రకాశరావుగారున్నారా?"

"లేరండీ" సమాధానంతో పాటు....

పచ్చటి ఆకులసందుల్లోంచి జొరబడిన వెన్నెల కిరణం తాకిడికి ఉలిక్కిపడి విచ్చుకో బోయే మొగ్గలా .... వుందా వొచ్చిన అమ్మాయి.

రాత్రంతా కురిసి వెలిసింతర్వాత, అందమైన పువ్వుమీద మిగిలిపోయిన మంచుముత్యా ల్లాంటి మంచు బిందువుల్లా, స్వచ్ఛంగా, పచ్చగావున్న అందమైన ఆమె మొహంమీద అక్కడక్కడా తళుక్కుమనే నీటి బిందువులు జారి రాలిపోడానికి సిద్ధంగావున్నాయి.

సాయంకాలపుటాకాశపు రంగు ఆమె మొహంమీద ప్రతిబింబించటంతో, మరింత చూడ ముచ్చటగావుంది—

అప్పుడే స్నానం చేసొచ్చిన ఆమె వొంటి మీంచి వొచ్చే పరిమళాలు ఆజాగా అంతా ఆక్రమించుకున్నాయి.

నిన్న చూసిన అమ్మాయి కాదు....

అయివుంటే—నేనివాళ ఇంకో వుద్దేశంతో వొచ్చేవాడిని.

అందంలోనూ, ఆకర్షణలోనూ కాదుగానీ....

చాలా దగ్గర పోలికలున్నాయి!

"కూర్చోండి."

కొత్తమనిషిని చూడగానే అంత విశాలమైన కళ్ళల్లో ఆత్తరపాటూ అందంగానే వుంది.

నిన్న అంతమందిలో ఈ అమ్మాయిని మాత్రం ఖచ్చితంగా చూడలేదు—

ఒకసారి చూస్తే కొన్ని కాలాలపాటు జ్ఞాపకం వుంచుకోదగ్గ అందమైన ఆ అమ్మాయిని నిన్న చూసుంటే యివాళ మరిచిపోవటం సాధ్యమా!

"మా నాన్నగారు లేరండి....ఓ అరగంట యింది బయటకెళ్ళి .... నిలబడేవున్నారు.... కూర్చోండి" అందా అమ్మాయి.

ఉలుకూ పలుకూ లేకుండా, సభ్యతమరచి, ఆమెని అలా కొన్ని క్షణాలు చూస్తూ నిలబడి పోవటం, ఆ క్షణంలో నా మట్టుకు నాకే సిగ్గని పించింది—

ఎంత భావుకుడ్నయితే మాత్రం, ఇద్దరు పిల్లల తండ్రిని, ఓ వయసులోవున్న పిల్ల ముందు ప్రవర్తించాల్సిన తీరేనా అది? మనసుకు లేకపోతే నా వయసుకేనా వుండొద్దూ మర్యాద?

"ఫర్వాలేదు....మీ నాన్నగారుంటే మాట్లాడుదామని వొచ్చాను....మళ్ళీ వొస్తాన్లే" అని వెనక్కి తిరిగే ప్రయత్నం చేసాను కూర్చోకుండానే.

"ఏమైనా చెప్పమంటారాండీ!"

"ఊఁ?....అఖర్లేదు....నే నాయన్ని కలు స్తాను" వరండా దాటి వీధిలోకి వొచ్చేసాను.

వెనక్కి తిరిగి మరోసారి చూద్దామనే వుందామ్మాయిని.

బాగోదు కదా—

"ఎవరొచ్చారని చెప్పమంటారు?" వరండా అంచున నిలబడి అడిగింది.

అప్పుడు మళ్ళీ చూసాను—

"నిన్న సాయంకాలం విజయనగరంనుంచి వొచ్చిన వాళ్ళ తాలూకూ ఆయనొచ్చారని చెప్పు" అన్నాను అప్రయత్నంగానే.

ఆ అమ్మాయి కంగారు పడ్డట్టు ఆ కళ్ళు చూస్తే తెలుస్తోంది—

"మా మామయ్యగారింట్లో వున్నారేమో చూసొస్తాను....ఈ పక్కవీధిలోనే లెండి....

వో క్షణం కూర్చోండి...." అందా అమ్మాయి.

కంగారు గొంతులోనూ తెలుస్తోంది—

ఆ హడావుడిలో ఎవరుంటే వాళ్ళని తీసుకొచ్చేసేలా వుంది—

"ఫర్వాలేదు — వీలుంటే నన్నాయన్ని కలవమని చెప్పు" బలవంతంగా వొచ్చేసాను....

రోడ్డుమీదకొచ్చి, హోటల్లో దూరి, వో కప్పు కాఫీ తాగిందాకా, మనసు స్థిమితపడనే లేదు—

ముగ్గురు అమ్మాయి లున్నట్టు చెప్పాడా ఇంటాయన.

ఆ సందర్భంలో ఈ పిల్ల కనపడలే దెందుచేతో?

కనపడుంటే—మా అందరి దృష్టి విధిగా ఆ అమ్మాయిమీద పడేదే—

పడుంటే—

ఇప్పటికి సంవత్సరంనుంచీ కుదరకుండా వున్న మా తమ్ముడి సమస్య చప్పున తీరిపోయేదే—

ఇప్పటికైనా మించిపోయిందేం వుందీ.... అడిగి చూద్దాం....కోరి అడిగితే కాదంటా దేవిటి?

ఏ అమ్మాయి అయితేనేం?

ఆ ముక్కే రాసి పడేసాను ఆ రాత్రే విజయనగరంవాళ్ళకి. ఆ మర్నాడుదయమే లెచి ఆఫిసు పనిమీద కేంపెళ్ళిపోయాను.

* * *

రెండు రోజుల్లో అయిపోతుందనుకున్న ఆఫీసు పని నాలుగురోజుల్దాకా తెమల్లేదు—

"మీకోసం ఆ ప్రకాశరావుగారు రెండు మూడుసార్లొచ్చి వెళ్ళారు....ఏదో వొకటి చెప్పేస్తే పోతుందిగా....పాపం ఎందుకలా ఆయన్ని తిప్పడం?"

అప్పుడే యిల్లు చేరిన నాకు కాఫీ యిస్తూ మా అవిడ—

"ఉత్తరాలేవైనా వొచ్చాయా?"

"కవరొచ్చింది....విజయనగరం నుంచి మావగారు రాసినట్టున్నారు — నే విప్పి చూళ్ళేదు."

నేను విప్పి చూసాను.

"అలాగే చూద్దాం....అయన్నడుగేవంటాడో...." ఉత్తరం ఆఖర్న.

"నువ్వేవైనా చెప్పావా ఆ ప్రకాశరావుగారితో?...." అడిగాను మా ఆవిడ్ని.

"మీ మనసులో వుద్దేశాలు యెవరికి తెలుస్తాయి?" అంది మా ఆవిడ తాగేసిచ్చిన కప్పు అందుకుంటూ.

"ఉత్తరం విప్పిచూస్తే తెలిసేవి" అన్నాన్నవ్వుతూ.

విప్పిచూడకపోవడమే మంచిదయింది—

ఎలా చెప్పేదో? అది విని ఆయనెలా అనుకునేవాడో?

ఒక పద్ధతుంది, కొన్ని విషయాలు చెప్పటానికి—వ్యవహారం వ్యవహారంవే కదా—

నేను వూర్లో లేనప్పుడు ఇంటిచుట్టూ తిరిగి నాయన వూళ్ళోకొచ్చి రెండురోజులయినా వొక్కసారీ కంటపడలేదు. నేనే వెళ్దావంటే ఊపిరి సలపని ఆఫీసు పనులతో నాకూ మరోమారు తీరికవలేదు—

* * *

ఆరోజు, ద్వారకానగర్‌లో, మారుమూల వున్న మా బ్రాంచి ఆఫీసు తణికీ పూర్తిచేసుకుని, సాయంకాలం నాలుగ్గంటలప్పుడు, వొక్క నెంబరు సిటీబస్సే అరగంటకీ రాని ఆ బస్‌స్టాపులో నిల్చున్నాను. ఊరి చివర్న వున్న బస్‌స్టాపేమో చాలా నిర్మానుష్యంగా వుంది. అయిదు నిముషాల క్రిందటే వో బస్సెళ్ళిపోయిందిట. సోడా తాగడానికని వెళితే ఆ పక్కనున్న కిళ్ళీకొట్టువాడు చెప్పాడు. చేసేదేంలేక వో పుస్తకం తెరిచి బస్‌స్టాపు గట్టుమీద కూర్చున్నాను.

పుస్తకం తెరిస్తే మరో ప్రపంచం అదే నాకు.

"నమస్కారమండీ!"

తియ్యటి గొంతు వినిపించి పుస్తకంలోంచి తలెత్తి, ఆ వినిపించినవేపు చూసాను.

ప్రకాశరావుగారింట్లో ఆ సాయంకాలం చూసిన అమ్మాయి.

విచిత్రంగానే వుంది ఇక్కడ కనపడటం!

గుర్తుంచుకుని పలకరించటవూ వింతగానే వుంది!

"నమస్కారం....నువ్వు?" తెలిసుండే అడిగాను.

"నే నండీ... ప్రకాశరావుగారి రెండో అమ్మాయిని....ఆ రోజు సాయంకాలం మీరు మా యింటికొచ్చారు కదా?"

"అవునవును....యిలా యెక్కడికొచ్చావమ్మా?" అడిగాను.

"లలిత గుడికొచ్చి, ఈ పక్కన మా స్నేహితురాలిల్లుంటేనూ వెళ్ళొస్తున్నానండీ...."

మన గుండెల్లో పీఠం వేసుక్కూర్చున్న అందమైన వొస్తువు యేదన్నా సరే, అనుకోకుండా కనిపించినప్పుడు, గుండెల పొరల్లో నిక్షిప్తమయివుండే ఆనాటి అనుభూతి పైకెగదన్ని వొక్క క్షణం ఊపిరి సలపకుండా వొళ్ళంతా కమ్మేస్తుంది కాబోలు!

"అలాగా" అంతకన్నా మాటలు రావు కొన్ని క్షణాలు.

"ఆ రోజు మీరిలా వెళ్ళారా....మా నాన్నగారలా వొచ్చారు. చెప్పగానే మీకోసం వెళ్లారు బస్‌స్టాపులో వుంటారేమోనని....లేరుట....ఆ మర్నాడుదయమే మీ ఇంటికెళితే మీరు కేంపెళ్ళిపోయారుట .... నాన్నగారు చెప్పారు...."

అందంగా వున్నవాళ్ళే ఆకర్షణీయంగా మాట్లాడగలరేమో! సాధారణంగా పెళ్ళికాని అమ్మాయిల్లో కనిపించని చొరవ ఈ అమ్మాయిలో చూసి ముచ్చట వేసింది నాకు.

"అవునుట....వచ్చారని చెప్పింది మా ఆవిడ....నేనే వొద్దామనుకుంటే కుదర్లేదమ్మాయి....మీ నాన్నగారూళ్లో వున్నారా?" అడిగాను కూర్చోమంటూ.

"ఉన్నారండీ" అంది కూర్చుంటూ.

వినయమూ అంతే....


అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము


శుద్ధిచేసినది.
వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము






మూడు
సైజులలో
50 మి.లి
100 మి.లి
200 మి.లి



''ఏవిటీ ప్రేమలేఖలు నాకు పోస్టు చేస్తావా? చచ్చాం!!''

''ఏం? ఎందుకూ?''

''మా నాన్న పోస్టుమాన్!!''

కొద్దిగా మొహంలో కనిపించే అలసట కూడా అందాన్నే ఇచ్చింది ఆ అమ్మాయికి!

ఇంత దగ్గిరగా మరోసారి చూడ్డంతో మనసులో అంతకుముందునించే మెసిలే అభిప్రాయానికి గట్టి స్థిరత్వమేర్పడిపోయింది.

అనుకున్నట్టూ జరిగితే మా తమ్ముడు అదృష్టవంతుడే—

మరో దీపం మా ఇంటి కాంతిని మరింత ప్రజ్వలింప చేస్తుంది—

"అవునూ, ఆ ముందురోజు మేమంతా మీ యింటికొచ్చినప్పుడు నువ్వు కనపళ్లేదేవమ్మాయి?"

అప్పటినుంచీ నా మనసులో మిగిలిపోయిన ప్రశ్న అది!

"అలాంటి సందర్భాలలో నే నెదటపడన్లేండి" అందామె.

అలా అంటున్నప్పుడు ఆమె తలొంచుకున్నా ఆ మొహంలో కొద్దిగా బాధ నాకు స్పష్టంగా కనపడింది.

"అదేవీ?" ఆశ్చర్యంగా అడిగాను, అర్థం కాక.

"మా అక్కయ్యకి పెళ్ళిచూపులన్నరోజు నన్ను జెయిల్లో పెట్టేస్తారు మా వాళ్ళంతా కల్సి" నిరుత్సాహంగా నవ్వుతూ....ఇంకా నా కర్థంకాలేదు—

"జెయిలేవిటీ?"

"అర్నెల్లక్రితం, మా అక్కయ్యకి వోసారి పెళ్ళిచూపులప్పుడు అనుకోకుండా ఓ ముచ్చట జరిగింది లెండి...."

"ఏవిటదీ?"

"ఏంలేదూ....పెళ్ళిచూపులంటే హడావిడి గదా....వొచ్చినవాళ్ళకి కాఫీ ఫలహారాలందిస్తూ కాస్త చురుగ్గా తిరిగాను...."

"తిరిగితే...."

"ఇక్కణ్ణించి వెళ్ళి, వాళ్ళేం రాసారో తెలుసాండీ...."

"ఏం రాసేరూ?"

"మీరు చూపించిన అమ్మాయి మాకు నచ్చలేదు....ఆరోజున చలాకీగా తిరిగి కాఫీలూ అవీ అందించిన మీ రెండో అమ్మాయి, మా అబ్బాయికి ఎంతో నచ్చిందీ....మీ కిష్టమయితే రాయండీ...." అని.

ఎవరికయినా అంతే అనిపిస్తుంది మరి అనుకుంటూ, తన చక్కదనాన్ని చక్కగా చెప్పిన ఆ పిల్ల తెలివికి అబ్బురపడ్డాను. ఇంతలోనే ఆ అమ్మాయి అంది:

"ఎవర్నయితే చూడ్డానికొచ్చారో ఆ అమ్మాయి నచ్చితే నచ్చిందనీ, నచ్చపోతే నచ్చలేదనీ రాయాలి! అంతే కాని బజార్లో వస్తువుల్ని బేరం చేసినట్లు మా కది నచ్చిందీ ఇది నచ్చిందీ అని రాసే వెధవల్ని తన్నొద్దండీ...."

"............"

బస్సు వొచ్చేసి నన్ను రక్షించేసిందా క్షణంలో!

